క్లుప్తంగా

జగనన్న, రాజన్నదొరలకు ధన్యవాదాలు


మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొరతో సాలూరు అసెంబ్లీ ఎస్సీ సెల్ వింగ్ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు

సాలూరు: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సాలూరు అసెంబ్లీ వింగ్ ప్రెసిడెంట్‌గా వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు రావడం చాలా సంతోషంగా ఉందని మజ్జి అప్పారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ మేరకు శుక్రవారం రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిశారు.

అమ్మవారి సిరిమాను చెట్టు తొలగింపు


తొలగిస్తున్న చెట్టు

సాలూరు: పట్టణంలో శ్యామలాంబ అమ్మవారి జాతరకు మరో ముఖ్య ఘట్టం ముగిసింది.అమ్మవారి సిరిమాను కోసం గుర్తించిన పట్టణంలోని ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలోని చెట్టును తొలగించి బుధవారం తీశారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరవడంతో సందడి వాతావరణం నెలకొంది.

రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడి వితరణ


నూకలవాడ ప్రాథమిక పాఠశాలకు స్పీకర్ సెట్‌ను అందించిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరామూర్తి

బలిజిపేట: మండలంలోని నూకలవాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీరామూర్తి పాఠశాలపై మమకారంతో స్పీకర్ సెట్‌ను బహూకరించారు. గత సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన పదవీ విరమణ పొందిన జి.శ్రీరామూర్తి పాఠశాలలో పనిచేసే సమయంలో విద్యార్థులకు వివిధ రకాల వస్తువులను బహుమతులుగా అందించడం పరిపాటి. పాఠశాల, విద్యార్థులపై ప్రేమతో, ఆయన స్పీకర్ సెట్‌ను బహూకరించినందుకు పాఠశాల ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా తెలుగు భాషాదినోత్సవం


తెలుగుతల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారులు

సీతానగరం: మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గెడ్డలుప్పి జంక్షన్‌లో ఉన్న కృషి విద్యాలయంలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులు తెలుగుతల్లి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం తెలుగుతల్లికి నివాళులర్పించారు. అలాగే బూర్జ, నిడగల్లు, సీతానగరం పాఠశాలల్లో మాతృభాషా దినోత్సవాలు జరిగాయి.

శంబర హెచ్‌పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో


శంబర హెచ్‌సీ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

మక్కువ: మండలంలోని శంబర హెచ్‌సీ పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో డి.డి స్వరూపరాణి సందర్శించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికను ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి, సంతృప్తి వ్యక్తంజేశారు. అనంతరం ఎస్.పెద్దవలస సచివాలయాన్ని పరిశీలించారు. పంచాయతీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

రక్తహీనతతో మాతృవేదన

- ప్రసవ సమయంలో రక్తం తక్కువై మరణాలు
- రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు
- పోషకాహారం ఇస్తున్నా కనిపించని ఫలితం
- క్షేత్రస్థాయిలో మరింత అవగాహన అవసరం

బలిజిపేట:

ప్రతిప్రాణి జీవించాలంటే శరీరంలో రక్తం సరఫరా చాలా ప్రధానం. ముఖ్యంగా కౌమారదశలోకి చేరిన బాలికలు రజస్వల అయిన తర్వాత వారిలో రక్తస్రావం కారణంగా రక్తహీనత క్రమంగా పెరుగుతూ పోతుంది. ఈ సమయంలో వారు సరైన పోషకాహారం తీసుకోకపోతే వివాహమైన తర్వాత తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. అదృష్టం బాగుంటే కొందరు కాన్పు సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పునర్జన్మ ఎత్తుతారు. లేకపోతే రక్తం తక్కువై ప్రాణాలు కోల్పోతారు. రక్తహీనతతో గర్భిణులు మాతృవేదన అనుభవిస్తున్నారు. చికిత్సకు వచ్చిన గర్భిణులకు అవసరమైన మందులు ఇచ్చి, పోహకాహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. తీవ్ర రక్తస్రావంతో ప్రసవానికి వచ్చిన కొందరు కోలుకోలేక ప్రాణాలు కోల్పోతారు. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు వైద్యారోగ్యశాఖ, వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా ఆస్పత్రులు, బోధనాస్పత్రులు, అర్బన్‌హెల్త్ సెంటర్ల పరిధిలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆశ కార్యకర్తల నుంచి వైద్యాధికారి వరకు గర్భం దాల్చిన మహిళ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. సాధారణ రక్తహీనత ఉన్న వారికి మాత్రలు, తీవ్ర రక్తహీనత ఉన్నవారికి సుక్రోజ్ ఇంజక్షన్లు ఇస్తున్నామని లెక్కలు చెబుతున్నా ఇప్పటికీ కొంతమంది గర్భిణులు తీవ్ర రక్తహీనతతో కన్ను మూయడం ఆందోళన కలిగిస్తోంది.

11గ్రాముల కంటే తక్కువ ఉంటే అప్రమత్తం



గర్భిణికి 12 నుంచి 14గ్రాముల వరకు రక్తం ఉండాల్సిందే. అంతకు తక్కువగా ఉంటే అటువంటివారు అప్రమత్తంగా ఉండాలి. 7గ్రాముల లోపు ఉండే వారిని సివియర్‌గా, 7నుంచి 9.9గ్రాముల లోపు ఉండేవారిని మోడరేట్‌గా, 10నుంచి 11గ్రాముల లోపు ఉండేవారిని మైల్డ్‌గా, 12గ్రాముల కంటే ఎక్కువగా ఉండే వారిని నార్మల్‌గా గుర్తిస్తారు. ఈ లెక్క ప్రకారం మండలంలోని బలిజిపేట, అరసాడ, గలావల్లి పీహెచ్‌సీల పరిధిలో ఉండే వారి వివరాలను పరిశీలిస్తే.

పీహెచ్‌సీ	మొత్తం గర్భిణులు	మోడరేట్ (గ్రాములు)	మైల్డ్ (గ్రా.)	సివియర్ (గ్రా.)	నార్మల్ (గ్రా.)
బలిజిపేట	198	8	39	--	151
అరసాడ	309	31	213	--	65
గలావల్లి	55	2	20	--	33


పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులు

పీహెచ్‌సీలు, అంగన్వాడీ కేంద్రాలు, విలేజ్‌హెల్త్ క్లినిక్‌లలో ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నా, మరీ రక్తం తక్కువగా ఉన్నవారికి సుక్రోజ్ ఇంజెక్షన్లు ఎక్కిస్తున్నా, అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందజేస్తున్నా రక్తహీనత శాతం ఎందుకు తగ్గడం లేదో అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉంది. అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే కోడిగుడ్లు, చిక్కీలు, కందిపప్పు, బెల్లం, తదితర పోషకాహార పదరార్థాలను అధికశాతం గర్భిణులు ఇళ్లకు తీసుకెళ్లి ఇంటిల్లిపాది వాడుకుంటున్నారు. దీనివల్ల గర్భిణులకు సరైన పోషకాహారం అందడం లేదన్నది బహిరంగ రహస్యం. క్షేత్రస్థాయిలో ఈ విషయంపై అటు వైద్యాధికారులు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది సరైన అవగాహన కల్పించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంటున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి



గర్భిణులుగా గుర్తింపు పొందిన వెంటనే వారు వారి వివరాలు ఆశ కార్యకర్తల వద్ద, అంగన్వాడీ కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. కేంద్రాల వద్ద ఇచ్చే పౌష్టికాహారాన్ని వారే తినాలి. ఇంటివద్ద అందరు పంచుకుని తినరాదు. ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. వాంతులు అలయ్యే సమయంలో తక్కువ మోతాదులో 4,5 పర్యాయాలు తినాలి. కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోరాదు.

– క్రాంతి కిరణ్మయి, వైద్యాధికారిణి, బలిజిపేట పీహెచ్‌సీ

చుట్టుముడుతున్న ఆరోగ్య సమస్యలు

రక్తహీనత కారణంగా గర్భంలో శిశువు ఎదుగుదల సరిగ్గా ఉండక అబార్షన్ అయ్యేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఒక్కోసారి నెలలు నిండకుండానే బిడ్డ జన్మించి మరణించే అవకాశం ఉంది. బీపీ కారణంగా ఫిట్స్ రావచ్చు, బీపీతో మెదడులో నరాలు చిట్లవచ్చు, కొన్నిసార్లు తల్లి, బిడ్డ మెంటల్‌గా తయారవుతారు. అకస్మాత్తుగా గర్భంలోనే బిడ్డ చనిపోవచ్చు. కొన్నిసార్లు గర్భంలోనే మాయ విడిపోయి కాన్పు కష్టం అవుతుంది. గర్భిణికి మూత్రపిండాలు, కాలేయం దెబ్బతినే అవకాశం ఉంటుంది.

బోద నివారణకు పరిశుభ్రతే మూలం

- సెంట్రల్ బృందం సభ్యురాలు ఆషినూ భట్నాగర్


పెద పెంకిలో సర్వేను పరిశీలిస్తున్న అధికారిణి ఆషినూ భట్నాగర్

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో నిర్వహిస్తున్న బోదకాలు ఎండీఏ కార్యక్రమాన్ని సెంట్రల్ బృందం సభ్యురాలు ఆషినూ భట్నాగర్ బృందం గురువారం పర్యవేక్షించింది. పెదపెంకి, వంతరాం, మిర్తివలస గ్రామాల్లో ఇంటింటి సర్వేను ఈ సందర్భంగా పరిశీలించారు. అందులో భాగంగా పెదపెంకి గ్రామంలో ఇంటింటికీ తిరిగి బోదకాలు సమస్య ఎప్పటి నుంచి ఉంది? దానికి సంబంధించి ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు, వైద్యశాఖ పరంగా ఎటువంటి సేవలు అందించారు? ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎండీఏ కార్యక్రమంలో ఏవిధంగా మీకు వైద్యశాఖ పరంగా మాత్రల పంపిణీ, మింగించే విధానంతో సేవలు అందించారు? దీనిపై అవగాహన ఎంతమేర కలిగించారు? ఇంటింటి సర్వే ఏ విధంగా నిర్వహిస్తున్నారనేది ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హితవు పలికారు. మన పరిసరాల ప్రభావంతోనే వ్యాధులు సోకుతాయన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎన్‌వీహెచ్‌ఎం కన్సల్టెంట్ నేహా సటోయ్‌యా, జిల్లా మలేరియా నివారణ అధికారిణి మణి, బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తున్నందుకు నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీతానగరం: ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని విస్మరిస్తున్నందుకు నిరసనగా రైతుసంఘం, సీపీఎం ఆధ్వర్యంలో సీతానగరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ మేరకు రైతు సంఘం, సీపీఎం మండల కమిటీ నాయకులు ఆర్.వేణు, ఆర్.ఈశ్వర రావులు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో పేదరిక నిర్మూలనకు మౌలిక సదుపాయాలు కల్పించనున్నామని, సాగునీటివనరులు కల్పిస్తామని, రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ప్రకటించి ఇంతవరకూ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మూతపడిన ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారాన్ని తెరిపించి రైతులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని ఇంతవరకూ పట్టించుకోలేదని మండిపడ్డారు. జిల్లా ఆస్పత్రిని మెడికల్ కాలేజీగా మార్పు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వెనుకబడిన జిల్లాకు రూ.10 కోట్లు కేటాయించాలని, జంఝావతి పూర్తిచేసి చివరి ఆయకట్టు భూమికి సాగు నీరుఅందించాలని, వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసి నిర్దేశించిన భూమికి సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు జి.అప్పారావు, సీహెచ్ కృష్ణారావు, ఆర్.రమణమూర్తి పాల్గొన్నారు.

పల్లకిలో పెళ్లికూతురు


వెంగాపురంలో పల్లకిలో ఊరేగుతున్న పెళ్లికూతురు

బలిజిపేట: గ్రామాల్లో పురాతన సంప్రదాయాల ప్రకారం పెళ్లి కూతురు, పెళ్లికొడుకును పల్లకిలో ఊరేగించడం ఎంతో వినోదాన్ని కలిగిస్తుంది. పెళ్లయిన తరువాత కొత్త జంటను పల్లకిలో కూర్చోబెట్టి ఊరేగింపుగా తీసుకువెళ్లడం ఆచారం. ఆ సమయంలో గ్రామంలో అందరూ వారిని అక్షింతలు వేసి దీవించడం వారి జీవితానికి ఒక వేడుక అని పెద్దల మాట. కాలాలు మారడంతో కొత్త సంప్రదాయాలతో, హైటెక్ యుగానికి అనుగుణంగా కొందరు ఊరేగింపులు కార్లలో చేస్తుంటారు. కారులో ఉండే కొత్త జంట ఎవరికీ కనిపించకుండా వేగంగా వెళ్లిపోవడంతో పెద్దల ఆశీర్వాదాలు వారికి దొరకడం లేదని అంటున్నారు. పురాన సంప్రదాయాలను విడనాడవద్దని పెద్దలు హితవు పలుకుతున్నారు.

కలెక్టరేట్ వద్ద సీపీఎం ధర్నా

- బడ్జెట్‌లో రూ.పదివేల కోట్లు కేటాయించాలని డిమాండ్


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: రానున్న అసెంబ్లీ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో పార్వతీపురం మన్యం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం రూ.పదివేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.ఇందిర డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, మెడికల్ కాలేజీ, హాస్పిటల్స్, రోడ్లు, యూనివర్సిటీ, మంచినీటి సౌకర్యం ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించినప్పటికీ ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదని, జిల్లాలో జంఝావతి, గుమ్మడిగెడ్డ, ఆడారు గెడ్డ, జంపర్ కోట గెడ్డ, రాళ్లగెడ్డ, వనకాబడిగెడ్డ లాంటి గెడ్డలపై డ్యామ్‌లు, మినీ రిజర్వాయర్లు నిర్మిస్తే వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని, కానీ ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడం వల్ల పనులన్నీ అలాగే నిలిచిపోతున్నాయన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజీగానీ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేక వైద్యానికి విజయనగరం, విశాఖపట్నం వెళ్లాల్సి వస్తోంది. చదువుకున్న విద్యార్థులకు పీజీ, యూనివర్సిటీ లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చుపెట్టి చదువుకోవాల్సిన పరిస్థితి వస్తోందని పేదవిద్యార్థులు చదవలేక డిగ్రీతోనే చదువు ముగించి సరైన ఉపాధి లేక గ్రామాల్లో యువత ఉపాధి పనులకు పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, కె.రామస్వామి, జిల్లా కమిటీ సభ్యుడు గొర్లి వెంకటరమణ పడాల రాజశేఖర్, పాలమిట్ట రాము, కర్రక చిరంజీవి, తాడంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ జాతర


రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీరాములునాయుడు, పార్టీ నాయకులు

సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న రేణక ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారి ప్రతిమను ఆలయంలో వేదపండితుల మంత్రాలతో ప్రతిష్ఠించారు. గురువారం, శుక్రవారం జరిగిన రేణుక ఎల్లమ్మ జాతర ముగిసింది. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వారందరికీ నిర్వాహకులు స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, ఎంపీటీసీ వై.గౌరీశ్వరితో పాటు నిర్వాహకులు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములునాయుడు, అంటిపేట, కేఎస్ పురం ఎంపీటీసీలు ఎస్.తిరుపతిరావు, యాళ్ళ వెంకటరమణ, బక్కుపేట మాజీ సర్పంచ్ బి.సూర్యనారాయణ, బక్కుపేట, రేపటివలస, బళ్ల కృష్ణాపురం, గెడ్డలుప్పి గ్రామాల ప్రజలు ఉన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి

- విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే రిజర్వేషన్ ఫీజు వసూలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్


పార్వతీపురంటౌన్: జిల్లావ్యాప్తంగా, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు చేస్తూ రానున్న విద్యాసంవత్సరం ఫీజు ఇప్పుడే రిజర్వేషన్ కట్టించుకుంటున్న వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.2వేల నుంచి రూ.5వేలు రిజర్వేషన్ డబ్బులు వసూలు చేస్తూ, పుస్తకాలు కొనుక్కోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే ప్రారంభ సమయానికి ఇంకా నాలుగైదు నెలలు గడువు ఉన్నప్పటికీ ఫిబ్రవరి నెల నుంచే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ, పుస్తకాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేయడం అన్యాయమన్నారు. ప్రధానంగా ప్రతి కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న చిన్న చితక ఉద్యోగస్తులను ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రతి ఏరియాలో కాలనీలలో మండల కేంద్రాలలో పట్టణ కేంద్రాలలో ఇంటింటికి తిప్పుతున్నారు. అడ్మిషన్లు ప్రారంభిస్తున్నప్పటికీ జిల్లాలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే ముందస్తు అడ్మిషన్లు ఆపాలని, రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి రిజర్వేషన్ ఫీజు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఈ సంఘటనలపై విచారణ జరిపించాలని కోరారు. ఇప్పటికైనా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్లు, రిజర్వేషన్ ఫీజులు, పుస్తకాల కొనుగోలు ఆపకపోతే ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

బడ్జెట్‌లో దళిత, ఆదివాసీలకు నిధులు కేటాయించాలి


సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోటజీవన్

పార్వతీపురం టౌన్: రాష్ట్ర బడ్జెట్‌లో దళిత, ఆదివాసీలకు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి తోటజీవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా దళిత, ఆదివాసీలకు నేరుగా ఉపయోగపడే విధంగా నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గత బడ్జెట్‌లో రూ.2,94,427కోట్లలో అభివృద్ధి వ్యయం రూ. రూ.1,62,476కోట్లు కాగా అందులో ఎస్సీలకు జనాభా ప్రకారం రూ.26వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.18వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఎస్సీలకు పూర్తి న్యాయం చేకూరేలా బడ్జెట్ ఉండాలని కోరారు.

సొంతూరు చేరిన వ్యక్తి


మురళిని డే నైట్ షెల్టర్‌కు అప్పగిస్తున్న శ్రద్ధా బృందం సభ్యులు

సీతమ్మధార: ఏయూటీడీ షెల్టర్ హోంలో ఆశ్రయం పొందిన మురళి(32)ని పార్వతీపురంలో ఐఆర్‌పీడబ్ల్యూఏ నడుపుతున్న డే-నైట్ షెల్టర్‌కు శుక్రవారం అప్పగించారు. మతి స్థిమితం కోల్పోయి ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్న మురళిని గతేడాది నవంబర్‌లో అక్కడి అప్నాఘర్ ఆశ్రమ్ ప్రతినిధులు గుర్తించారు. కొన్ని రోజులు వసతి కల్పించి, చికిత్స నిమిత్తం ముంబైలోని శ్రద్ధా ఫౌండేషన్‌కు పంపించారు. అక్కడ పూర్తిగా కోలుకోవడంతో తన సొంతూరు పార్వతీపురం మన్యం జిల్లా దగ్గర వేమకోటవరం పంపే క్రమంలో ఏయూటీడీ షెల్టర్ హోమ్‌కు తీసుకొచ్చారు. అతన్ని తీసుకుని ఆ ఊరు వెళ్తే, తల్లిదండ్రులు అప్పటికే చనిపోయారని, అతని సొంతమంటూ ఎవరూ లేరని గ్రామస్తులు చెప్పారు. దీంతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సహకారంతో పార్వతీపురంలోని డే-నైట్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. మురళికి ఏదైనా ఉపాధి కల్పిస్తామని అక్కడి సిబ్బంది తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒక్కొక్కరికి పదివేల జరిమానా

పాచిపెంట: మండలంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒక్కొక్కరికి రూ.పదివేల జరిమానాను జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ కనకలక్ష్మి విధించినట్లు ఎస్సై వెంకటసురేష్, కోర్టు పీసీఆర్ రామ్మోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ, ఐదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి పదివేల రుపాయిల చొప్పున రూ.50 వేల జరిమానా విధించారన్నారు. రెండవ సారి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే 3 నెలల జైలు శిక్ష విధించనున్నట్లు మెజిస్ట్రేట్ హెచ్చరించారని తెలిపారు.

మండలస్థాయి పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మక్కువ: స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో శుక్రవారం ఎంఈవోలు సత్యనారాయణ, శ్యామ్‌సుందర్‌ల ఆధ్వర్యంలో మండలస్థాయి పోటీలను నిర్వహించారు. వ్యక్తృత్వ, పోస్టర్ పెయిటింగ్, వ్యాసరచన మండలస్థాయి పోటీలను నిర్వహించగా ఈ పోటీల్లో మండలంలోని ములక్కాయవలస మోడల్‌పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.గణేష్ వ్యక్తృత్వ పోటీలో, వ్యాచరచన పోటిలో బి.వినయ్, డ్రాయింగ్‌లో టి.శివప్రసాద్‌లు గెలుపొందారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు నాగమణి, చంద్రికలు అభినందించారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం


పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరికి మద్దతుగా ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతానగరం: ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ బలపర్చిన అభ్యర్థి కె.విజయ గౌరి విజయాన్ని ఆకాంక్షిస్తూ శుక్రవారం యూటీఎఫ్ మండల శాఖ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ మేరకు మండశాఖ యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాసరావు బొత్స ప్రసాదరావులు మాట్లాడుతూ ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై నిరంతరం పోరాడిన విజయ గౌరికి మొదటిప్రాధాన్యతా ఓటును వేసి శాసన మండలిలో ఉపాధ్యాయ వాణిని వినిపించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల, జిల్లా కమిటీ సభ్యులు బి.ఆదినారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై ప్రజలకు వివరించాలి


పెదమరికి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమణమూర్తి తదితరులు

పార్వతీపురంరూరల్: సేంద్రీయ ఎరువుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పెదమరికి గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తనుంచి సంపదను సృష్టించేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని కోరారు. తడి,పొడి చెత్తను సేకరించి సేంద్రీయ ఎరువుగా తయారు చేసి విక్రయించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని చెప్పారు. అనంతరం గ్రామంలో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సీసీ కాలువను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్మాణాలను చేపట్టాలని సూచించారు.ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామ పాదుకా పట్టాభిషేకాన్ని విజయవంతం చేద్దాం

పార్వతీపురంటౌన్: శ్రీరామ పాదుకా పట్టాభిషేకాన్ని విజయవంతం చేద్దామని వికాస్ తరంగణి అధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిదండి చిన్నజియర్ స్వామి వారి ఆధ్వర్యంలో పట్టణంలోని సౌందర్య నారాయణ మూర్తి నగర్‌లో మార్చి 5న పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వాసులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.